- భాగవతుల సుబ్రహ్మణ్యం

# అధ్యక్ష రాక్షసీయం

సభలూ. సమావేశాలూ సవాలక్ష చూస్తూనే ఉన్న నాకు ఏదో ఓ సభకి లేదా ఓ చిరు సమావేశానికి అధ్యక్షత వహించే భాగ్యం కలిగితే బావుణ్ణనే అతి సాధారణమైన... చాలా చిన్న కోరిక - ఓనాటి శుభోదయాన, సూర్యుడి కంటే ముందే ఉదయించింది. చెప్తే మీరు నవ్వుకోవచ్చు గానీండి!... నమ్మండి - నమ్మకపోండి... అదేమన్నా పెద్ద కోరికా?

ఇక - అర్హత, హోదా, ఔచిత్యాలంటారా? వాటికీ ఏం కొదవలేదు. పుష్కలంగా ఉన్నాయి. అయినా నాకు తెలీకడుగుతానూ... మీరు అన్ని సభలూ - సమావేశాలకీ కాకున్నా, ఎకొద్దో గొప్పో ఇలాంటి వాటికి హాజరై ఉండకపోరు. ఆయా మీటింగులకి అధ్యక్ష పీఠాన్నలంకరించే మహాశయుల పోకడలు గమనించకుండానూ పోరు. వాళ్ళకా చాన్సివ్వదగునా? నేను తగనా?

అసలా మాటకొస్తే, ఈ పక్షపుత్రయంలో వారానికో పదిరోజులకో ఒకటి చొప్పున జరిగే ఏ ఐదారు మీటింగులనో తీసుకోండి! మహావాక్యాల మాణిక్యాలుగారో, (వం.వం. అంటారు) ఎంత [illegible] యినా మూడు [illegible] తో [illegible]



చెప్పేసే ముఖస్తుతుల ముముక్షు మూర్తిగారో (ఈయననే ముద్దుగా త్రిమూర్తి అంటారు. పేరులోనే మూడు 'ము' వర్ణాలుంటాయి గమనించండి.) వాటిలో అధ్యక్షులుగా కచ్చితంగా ఉండి తీరుతారు. కష్టరిపి అర్హవై పైబడ్డ తలకాయలే!

అదేం ఖర్మో?! [illegible] - పూర్తి ఛాందసం ఉన్నవాళ్ళే, ఈ నిర్వాహకుల కళ్ళకు ఆనుతారేమో! చురుకుదనం ఉరకలేసే కుర్రాళ్ళకా ఛాన్సిచ్చి చూడరు. కుర్ర చేష్టలూ - వెర్రి వాగుళ్ళూ రసాభాస కార్యక్రమాలవుతాయని ఫియరో. ఫికరో మరి! చాదస్తపు హోరునైనా భరిస్తారు గాని, 'థర్టీ - ఫార్టీ'లు దాటని వాడికి ప్రిసైడింగ్ పవరా? కాదు అనేస్తారు. ఒక్కసారి అధ్యక్ష పదవికి నాలాంటి థర్టీ ప్లస్‌ని పెట్టి చూస్తేనో! చూపించనూ - నా తడాఖా?

మదీయ నామధేయం - శుక్రాచార్యుడు. పేరెక్కడో విన్నట్టుంది కదూ? శుక్రాచార్యులంటే ఎవరూ? రాక్షసులకి మహా గురువు. మా అమ్మా నాన్నా ఎంతో ఆలోచించే నాకు ఈ పేరు పెట్టేరని నా నమ్మకం - దేవతల గురువు బృహస్పతి పేరు పెట్టేస్తారేమో! 'బుద్ధిగా బృహస్పతి వంశీకుడు' అని కదా నానుడి! బుద్ధిగా చెప్పినట్టు విని, పొదిగి కూర్చొనేవాడు అధ్యక్ష పదవి ఎలా నిర్వహిస్తాడు? ఈ పదవికి కాస్త కమేండింగ్ పవరుండాలి! (అదనంగా కామెడీ హంగూ ఉంటే మరీ మంచిది) ఫ్యూచర్లో నేనిలా అధ్యక్ష పదవిని అలంకరిస్తానని మా వాళ్ళు గట్టిగా ఆనాడే ఊహించారో ఏమో! అందుకే ఆ పేరు పెట్టారు కాబోలు!

అన్నట్టు... అధ్యక్ష మహాశయుడికి, వేదిక ఎదుట ఉన్నవాళ్ళనే కాక - వేదిక మీదున్న వాళ్ళని కూడా ఆకట్టుకోగలిగే వాకచక్యం ఉండాలి! ఇవన్నీ ఉండబట్టే శుక్రాచార్యుడు చలనశీలురైన రాక్షసులకి గురువయ్యాడు... అసలే నోట్లో నాలుకలేని దేవతలకి అంతకంటే 'బుద్ధూ' లాంటి బృహస్పతి గురువయ్యాడు. సో... కాస్త విగరూ - పొగరూ - జైగాంటిక్ (లేదా జైంట్ సైజ్) ఫిగరూ ఉన్న వాళ్ళే అధ్యక్షులనదగ్గ వాళ్ళు అని మదీయ తాత్పర్యం.

ఆ లక్షణాలు అక్షరాలా నాకు సరిపోతాయి - కనుక, శుక్రాచార్యుడు అధ్యక్ష స్థానానికి తగినవాడు - అని ఘోషిస్తున్నాను. బట్ - వినిపించుకొనే నాథుడేడీ? నా సెల్ఫ్ డబ్బాకి నా బెటర్‌హాఫ్ మాత్రం కొంత స్పందించింది కానీ... అది అమాయకంగా అందో - అతి తెలివిగా అందో నాకు అర్థం కాలేదు.

'ఇంత చక్కగా సభా కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళుంటే, ఆపాటి ప్రెసిడెన్సీ మీరూ వెలగబెట్టొచ్చు! ప్రిసైడింగు అంటే పిండొడియాలు పెట్టడమంత ఈజీ అని నాకు తెలీదు సుమండీ!' అంది వేళాకోళంగా.

ఆవిడ నన్ను ఏమన్నా అంతగా పట్టించుకోను గానీ - ఫంక్షను ప్రిసైడింగుని మరీ అన్యాయంగా పిండొడియాలు పెట్టడంతో పోల్చడమే నాకు ఒళ్ళు మండించింది.

అది ఎక్కువై పోయేదో, తగ్గేదో గాని... సరిగ్గా... అదేదో కాకతాళీయం అంటారే... అలా - తక్షణమే నాకో అధ్యక్ష పదవి ఛాన్స్. నా క్లోజ్‌ఫ్రెండ్ మూలంగా నన్ను వరించింది.

ఓ మల్టీ నేషనల్ సాఫ్ట్ డ్రింక్ కంపెనీ, కొత్తగా ఏదో శీతల పానీయాన్ని మార్కెట్లో ప్రవేశపెట్టబోతూన్న తరుణంలో, పబ్లిక్ అటెన్షన్‌ని తన వైపు తిప్పుకోడానికి ప్లాన్ చేసిందట. అందులో భాగంగా ఫిలిం స్టార్లనీ - పొలిటీషియన్లనీ (పెద్ద పేరున్న వాళ్ళనే లెండి!) పిల్చి, భారీగా వేదిక మీద సన్మానించ తలపెట్టిందట!

సదరు కంపెనీ బాగా బలిసిన దేశానిది లెండి! ఈ ఫంక్షను కయ్యే ఖర్చు వాళ్ళకి ఆఫ్టరాల్. కేవలం ఆరేడు లక్షలకి మించకుండా చూసుకోమన్నార్ట! అలా చూసుకోమని కోరబడినవాడు, సాక్షాత్తూ ఆ కంపెనీ కిక్కడ స్థానికంగా మేనేజరూ నాకు క్లోజ్ ఫ్రెండూ అయిన ఎ.టి.పరాయణ్. (ఎ.టి. అంటే ఏటో అని అడగొద్దు. ఆర్తత్రాణ అనుకోండి. నాకేమీ అభ్యంతరం లేదు.

వాళ్ళు కేటాయించిన బడ్జెట్‌కే కళ్ళు తిరిగిపోయిన మా పరాయణుడు, ఆదరాబాదరాగా నా దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చి

